ఇతిహాసాలు :

# ముల్లా కథలు

★

రచన:
పొట్లపల్లి రామారావు

ఓ ప్రమాదకరమైన కార్యాన్ని నెరవేర్చడానికి, ఒక సాహసికుడు కావలసివచ్చింది రాజుగారికి. తన ఉద్దేశ్యాన్ని తెలుపుతూ దేశమంతటా దండోరా వేయించాడు రాజు. మామూలు సమయాల్లో తమ పౌరుష, ప్రతాపాలు వెళ్లబోసుకుంటూ, తిరిగే యోధాన యోధులంతా, రాజు ఏ అగ్నిలో దూకమంటాడో అని "గపుచిపు"గా ఊరకున్నారు. ఎవడూ "నేనని" ముందుకు రాలేకపోయేసరికి, ఆ ఊళ్లోని కొందరు రాజుగారి సమక్షానికి ముల్లాను వెళ్ళమన్నారు.

"నేను నెగ్గగలనని నమ్మిక ఉందా మీకు?" అన్నాడు ముల్లా.

"పసితనమునుండీ బస్కీలు, దండాలు తీసినవాడివి, నీవుకాక ఎవరు నెగ్గుతారు" అన్నారు వాళ్లు.

రాజుదర్బారులో ముల్లా హాజరయ్యాడు. రాజు ముల్లాను చూచి వీడెవడో హాస్యము చేయడానికి వచ్చాడనుకొని, "పరీక్షకు నిలుస్తావా?" అన్నాడు.

"తమ చిత్తం" అన్నాడు ముల్లా.

రాజు ముల్లాను రెండు చేతులు భుజాలకు సరిగా ఎత్తి నిలుచోమని, ఒక విలుకాణ్ణి పిలిపించి ముల్లా శిరోవేష్ఠముగుండా బాణము వేయమన్నారు. విలుకాడు బాణము ఎక్కుబెట్టి విడిచాడు. బాణము శిరోవేష్టాన్ని చించుకొనివెళ్ళిపోయింది. ముల్లా లోపల ఎంత బాధపడ్డాడో కాని, పైకి మాత్రము తొణకకుండా నిలవబడ్డాడు. రాజు అక్కడికి తృప్తిపడక మరో బాణం సంధించి జుబ్బాగుండా విడవమన్నాడు. ముల్లా ప్రాణాలు మటుమాయమైనా ఆ భయాన్ని పైకి కనపడనీయలేదు. విలుకాడు మరో బాణం సంధించి విడచాడు. అది జుబ్బాను తూట్లుకొని బయటికి వెళ్ళిపోయింది. రాజు ముల్లా తెగువతనానికి మెచ్చుకొని, అతనికి ఒక విలువైన శిరోవేష్ఠము, ఒక పట్టుజుబ్బా, పారితోషికంగా యివ్వమన్నాడు.

"వాటితోబాటు ఒక లాగు దయచేయించండి" అన్నాడు ముల్లా.

"నీ లాగుకు బాణము వేయలేదే" అన్నాడు రాజు.

"బాణము వేయని మాట నిజమేకాని, కొత్తలాగు చాల అవసరం...బుద్ధిమంతులకు విప్పిచెప్పడం అక్కరలేదనుకుంటాను" అన్నాడు ముల్లా.

## ముల్లా యుక్తి:

ముల్లా ఒకసారి భార్యతో తగాదాపడి, దేశాలవెంబడి వెళ్ళిపోయాడు. దారిలో నీళ్లు, నిప్పులు, సరిగా దొరకక పూర్తిగా చిక్కిపోయాడు. తన శరీరస్థితి చూచుకొని, తన అవసానదశ వచ్చిందేమో! అని భయపడ్డాడు ముల్లా. కాని తాను విడిసిన పట్టణాధికారి "తన ఊళ్లో చచ్చిన ప్రతివాని కర్మక్రియల కోసరం, నలుబయి దీనారాలు విరాళమిస్తాడని" తెలిసి అతనికి కొంచెం ధైర్యమేసింది. "చచ్చినవాళ్ళమీద ఇంత ఉదారత చూపుతె, జీవచ్ఛవాలైన మాబోటి దీనులమీద ఎంత దయ చూపుతాడో," అనుకొని. ఆయన సమక్షంలో హాజరు అయి, తన కష్టాన్ని నివేదించుకున్నాడు.

పట్టణాధికారి ముల్లాగోడు విని "నేను చచ్చినవాళ్ళకు యిస్తాను. కాని బ్రతికినవాళ్లకు ఇవ్వను" అన్నాడు.

"ఇట్లాగే నాస్థితి కొన్ని గంటలుంటే, నేనూ చనిపోతాను" అన్నాడు ముల్లా.

"ఆ పిదప మేము చూచుకుంటాము" అన్నాడు అధికారి.

“నేను చనిపోతే మీకు నలుబయిదీనారాలు ఖర్చుపెట్టవలసి వస్తాయి. ఇప్పుడు యిరువయి దీనారాలతో నేను బ్రతికిపోతాను. మిగతా ఇరవయి దీనారాలు మీ ఖజానాలో మిగిలిపోతాయి” అన్నాడు ముల్లా.

పట్టణాధికారికి ముల్లామాటలు సబబుగా కనబడ్డాయి. వెంటనే ఇరువయి దీనారాలు ఇచ్చివేసాడు ముల్లా. ఆ ఇరవయి దినారాలతో, కడుపునిండా తిని, మామూలు మనిషి అయినాడు. ఇంతలో తలచినతలంపుగా ఆ ఊళ్లో మహామారి మొదలైంది. పీనుగల పైన పీనుగలు శ్మశానము నిండ దొడిగాయి. పట్టణాధికారి ఊరంతా ఖాళీ చేయవలసిందని ఆజ్ఞ ఇచ్చాడు. డబ్బు ఉన్నవాళ్లంత వెళ్ళిపోదొడగారు. ముల్లాదగ్గర రాగిడబ్బు లేకుండా ఖర్చు అయిపోయింది. ముల్లా మళ్ళీ పట్టణాధికారి దగ్గర హాజరై అన్నాడు.

“మహాప్రభో! ఇదివరకు నన్ను ఒకగండము నుండి తప్పించారు కాని, మళ్ళీ ఓ చావు వచ్చి పడింది. ఆ మహామారి నన్ను చుట్టుకుంటే ఇది వరకు వెచ్చించిన యిరవయిదీనారాలే కాక, మళ్ళీ నలుబయి దీనారాలు ఖర్చు పెట్టవలసి వస్తుంది. కావున ప్రభో! నాబకాయి ఇరువయి దీనారాలు ఇప్పిస్తే నేను సురక్షితంగా ఇల్లు చేరుకుంటాను”

ముల్లా యుక్తికి సంతోషపడి ఆ మిగతా ఇరువయి దీనారాలుకూడ ఇచ్చివేశాడు అధికారి.

“అందరు చచ్చి చావు ఖర్చు సంపాదిస్తే, నేను బ్రతికిఉండి సంపాదించాను” అని గర్వంగా ముల్లా ఇంటిదారి పట్టాడు.

## ఇంకో యుక్తి:

ముల్లా పన్ను ఒకటి ఊడిపోవడానికి సిద్ధమై ఎంతో బాధ పెట్టదొడగింది. ముల్లా ఓదంత వైద్యుని దగ్గరికి పోయి పన్ను చూపించాడు. పన్ను ఊడతీయడానికి రెండు దీనారాలు అడిగినాడు వైద్యుడు. ముల్లాకు ఒక్కటికన్న ఎక్కువ యివ్వ బుద్ధి పుట్టలేదు. వైద్యుడు దానికి సిద్ధపడలేదు. ఇక విధిలేక రెండు దీనారాలు ఇస్తానని ఒప్పుకున్నాడు ముల్లా. తీరా పన్ను ఊడతీసే సమయానికి నొప్పి పుట్టిన పన్ను చూపక, దాని పక్క మరో పన్ను చూపించాడు. దంతవైద్యుడు బలిమిగా ఆ పన్ను లాగివేసాడు. ముల్లా పెద్దగోల పెట్టాడు. “ఎక్కడివాడవయ్యా నీవు...నొప్పిపెట్టిన పల్లు తీయక నిక్షేపంలాంటి పన్ను ఊడపీకావు” అన్నాడు. తానే పొరపడ్డానేమో అనుకొని ఆ నొప్పి ఎత్తిన పల్లుగూడా లాగివేసాడు.

దంతవైద్యుని పని పూర్తి కావడంతోనే ముల్లా నవ్వుతు లేచాడు. “ఒక పన్ను తీయడానికే రెండు దీనారాలు అడిగినావుకదూ? రెండు దీనారాలకు, రెండు పళ్ళు తీయించుకున్నాను, చూచావు?” అన్నాడు.



షెలెట్ క్విక్ రిట్

నిబ్బుకాగితానికి తాకగానే వ్రాయు స్వదేశిరాలలో ఇది శ్రేష్ఠమైనది. ఈపేరు గ్యారంటీ సూచించును. పౌంటన్ పెన్ కు క్విక్ రిట్ వాడుడు.

తయారుచేయువారు: షెలెట్ బ్రదర్సు
8, లక్ష్మదాస్ వీధి, పి. టి. మద్రాస్.